ప్రాణం వచ్చిన ప్రతిమ!

అజీజ్

"ఎస్, ప్లీజ్!"

"ట్రంకాల్ ఫ్రం హైదరాబాద్!" అన్నాడు టెలిఫోన్ ఆపరేటర్ అవతలనించి.

వినడానికి సిద్ధపడుతూ, "ఆఁ!" అన్నాను.

"మాట్లాడండి" చెప్పాడు ఆపరేటర్.

"హలో, హు ఈజ్ స్పీకింగ్?" అడిగాను.

"డిటెక్టివ్ దుర్యోధన్ గారి అసిస్టెంట్ అర్జున్ గారితో మాట్లాడాలి" వినిపించింది అవతలినించి సుమధుర స్త్రీ కంఠం.

"అర్జున్ హియర్! మీరెవరు?"

"నా కంఠాన్ని పోల్చుకోలేదా అర్జున్? నేను, విశాలిని!"

"సారీ, అయామ్ వెరీ సారీ! నీ కంఠంలో మునుపటి చలాకీతనం, మాధుర్యం లోపించింది. విచార జీరలు వినిపిస్తున్నాయి...."

"నెలరోజుల క్రితం జరిగిన మా నాన్న హత్య సంగతి తెలుసుకదా మీకు?"

"తెలుసు. పేపర్లో చదివాను. వెంటనే నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ టెలిగ్రాం కూడా ఇచ్చాను. అందలేదా?"

"అంది వుండాలి. చాలామంది పంపారు టెలిగ్రాంలు."

"హంతకుడి ఆచూకీ ఏమైనా తెలిసిందా?"

"పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇంకా ఏమీ తెలీలేదు. ఐతే, ఈమధ్య నన్నూ నాన్నలాగే హత మార్చడానికి హంతకులు పటిష్టమైన ఓ పథకం వేశారు."

"మై గాడ్! ఎలా?"

"నాన్న మరణంతో నేను అనారోగ్యం పాలయ్యాను. మా ఫ్యామిలీ డాక్టర్ రాసిచ్చిన టానిక్ తెప్పించి, రెండు రోజులు వాడాను. బాగానే వుంది. కానీ మూడో రోజు రాత్రి తాగి పడుకున్నానో లేదో, ఎడ తెరిపిలేని వాంతులూ, విరేచనాలూ ప్రారంభమై మూర్ఛ పోయినంత పనైంది.

దాంతో, డాక్టర్ గారికి ఆ టానిక్ విషయంలో అనుమానం వచ్చి, లేబొరేటరీలో రసాయన పరీక్ష జరిపించారు. అప్పుడు తెలిసింది అసలు విషయం! అందులో విషం కలిపివుందని! దాన్ని తాగాక, అదృష్టవశాత్తూ వాంతులై నా జీర్ణకోశంలో చేరిన ఆ విషమంతా బైట పడి బ్రతికిపోయాను. ఇంట్లోనే యెవ్వరో ఆ టానిక్‌లో విషం కలిపి వుంటారని నా అనుమానం!"

"మీతో బాటు ఇంట్లో ఇంకెవరున్నారు?"

"చిన్నాన్న వెంకట్రావూ, పిన్ని భానుమతీ, ఇద్దరు

నాఖర్లు మాత్రమే! దయచేసి మీరూ, డిటెక్టివ్ దుర్యో ధన్ గారూ ఇక్కడికి వచ్చి, కొంతకాలం మా ఇంట్లో వుండి, హంతకుల్ని పట్టుకోవలసిందిగా అభ్యర్థిస్తు న్నాను."

"దుర్యోధన్ గారు ఓ కేసు పనిమీద రెండురోజుల క్రితమే బెంగుళూరు వెళ్ళారు. నేనొక్కణ్ణే రాగలను. మనం పరాయివాళ్ళం కాము. యూనివర్సిటీ సహా ధ్యాయులం! మంచి మిత్రులం! మీ గురించి మీకన్నా నాకే ఎక్కువ ఆందోళనగా వుంది.

కాయశక్తులా ప్రయత్నించి, మీ శత్రువుల్ని పట్టి చట్టపుకోరల కప్పగించే వరకూ విశ్రమించను. సరేనా?"

"థాంక్స్! మెనీ మెనీ థాంక్స్! ఎప్పుడు బైలుదేరు తున్నారు మరి?"

"వీలైతే ఈ రోజే బైలుదేరేవాణ్ణి. కానీ, ఇంత త్వరగా విమానానికి టికెట్ దొరకడం కష్టం గనుక, ఈ రోజు సీటు రిజర్వు చేసుకుని, రేపుదయం ఫ్లైట్ ఎక్కు తాను. మధ్యాహ్నానికల్లా మీ ఇంట్లో వుంటాను."

"ఆల్ రైట్! మీకోసం ఎదురుచూ స్తుంటాను."

"ఓ.కే! సీయూ!" అంటూ రిసీవర్ దించి, ఆలో చనలో పడ్డాను.

2

మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో బేగంపేట ఏర్ పోర్టులో దిగింది విమానం!

సూట్ కేస్ తో ఏర్ పోర్టు బైటికి వచ్చి, టాక్సీ ఎక్కి, "బంజారా హిల్స్!" అన్నాను డ్రైవర్ తో.

బైలుదేరింది టాక్సీ.

సాధారణంగా హైద్రాబాద్ లోని అనేకమంది ధన

వంతులు ఆ ప్రాంతంలోనే నివసిస్తుంటారు. అక్కడే వుంది విశాలి ఇల్లు. ఆమె తండ్రి మధుసూధనరావు గారికి ఇటు సికింద్రాబాదులోనూ, అటు హైద్రాబాదులోనూ నాలుగు పెద్ద బట్టలషాపు లున్నాయి.

విశాలి ఆయన ఒక్కగానొక్క కూతురు. లేత వయసులోనే తల్లిని కోల్పోయిన విశాలిని ఎంతో అపురూపంగా చూసుకునేవారాయన. ఉస్మానియా యూనివర్సిటీలో నేను ఎమ్.ఏ. చేస్తున్నప్పుడు ఆమె నా క్లాస్ మేట్!

అపరాధ పరిశోధనలో మొదటినించీ నాకున్న ఆసక్తి దృష్ట్యా ఆ తరవాత నేను క్రిమినాలజీలో డిప్లామా తీసుకుని, ప్రఖ్యాత డిటెక్టివ్ సుర్యోధన్ గారివద్ద అసిస్టెంటుగా ఉద్యోగం సంపాదించుకోగలిగాను.

టాక్సీ బంజారా హిల్స్ చేరుకుంది. డ్రైవర్ కు సూచనలిస్తూ విశాలి ఇంటికి తీసికెళ్ళాను. చాలా ఎత్తయిన ప్రదేశంలో వుంది వారి బంగళా. బంగళాముందు విశాలమైన కాంపౌండూ, అందమైన పూలతోటా వున్నాయి.

మెయిన్ గేటుగుండా కంపౌండ్లోకి తిరిగింది టాక్సీ. అక్కడ ఇంకా చాలా కార్లు ఆగివున్నాయి. ఎంతో మంది ఇంట్లోకి వెళుతూ, వస్తూ కనిపిస్తున్నారు. లోపల ఏదైనా పార్టీ జరుగుతోందా?

ఆలోచిస్తూ టాక్సీ దిగి, డ్రైవర్ కు బిల్ పేచేసి, సూట్ కేస్ తో ఇంటివైపు నడిచాను. పోర్చ్ లో అడుగు పెడుతుండగా ఇంట్లోంచి బైటికివస్తూ కనిపించాడు ప్రదీప్! విశాలిలాగే అతనూ యూనివర్సిటీలో నా సహాధ్యాయుడే!

నన్ను చూడగానే, "అర్జున్! ఎప్పుడొచ్చావ్?"

అడిగాడు సంభ్రమంతో.

"ఇదే రావడం! ఇంట్లో చాలా సందడిగా వున్నట్టుందే. ఏదైనా విందు జరుగుతోందా? విశాలి ఎక్కడ?" అడిగాను అతనితో కరచాలనం చేస్తూ.

"లోపలుంది. రా, చూపిస్తాను" అంటూ నా భుజం మీద చెయ్యి వేసి లోనికి తీసికెళ్ళాడు ప్రదీప్.

హాలు కుడిపక్కన ఓ గది వుంది. అతిథులు ఆ గదిలోకే వస్తూ పోతున్నారు. నన్నూ ఆ గదిలోకి తీసికెళ్ళి, "చూడు, విశాలిని మన స్నేహితురాలిని" అంటూ నేలమీదికి చూపాడు ప్రదీప్.

అంతే! నా చేతిలోంచి సూట్ కేస్ జారి కిందపడింది!

నేలమీద మెడవరకూ దుప్పటి కప్పి, పడుకోబెట్టి వుంది విశాలి శవం!

తలకటూ, ఇటూ అగరవత్తులు వెలుగుతున్నాయి. పండితులు భగవద్గీత పఠనం చేస్తున్నారు తగ్గు స్వరంలో.

నిన్న నాతో ఫోన్లో మాట్లాడిన నిండు ప్రాణి ఇంత త్వరగా నిర్జీవమై పోయిందా? ఎలా నమ్మడం?

"అర్జున్! విశాలి ఇక లేదు మనకు" అన్నాడు ప్రదీప్ గద్గద స్వరంతో.

"ఎప్పుడు జరిగింది? ఎలా జరిగింది?" అడిగాను అయోమయంగా.

"ఆశ్రయమిచ్చినవారే కాలసర్పాలై కాటు వేస్తే ఇలాగే జరుగుతుంది. ఇలారా, చెబుతాను" అంటూ నన్ను డ్రాయింగ్ రూంలోకి తీసికెళ్ళి, తలుపు మూశాడు ప్రదీప్.

"అర్జున్ కాసేపట్లో వాళ్ళు కర్మకాండకోసం విశాలి శవాన్ని స్మశానానికి తీసికెళ్ళవచ్చు. నువ్వు ఎలాగైనా

వాళ్ళనాపి, శవాన్ని పోస్టుమార్టం చేయించమని వత్తిడి చెయ్యి" అన్నాడు ప్రదీప్ ప్రాధేయపడుతూ.

"పోస్టుమార్టమా! ఎందుకూ?" అడిగాను నిర్విర్ణోయి.

"విశాలి మరణం సహజమైంది కాదు!"

"మరి?"

"ఆమె హత్య చెయ్యబడిందని నా అనుమానం!"

"అందుకు ఆధారం ఏమిటి?"

"కొంత కాలంనించీ ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. అందుకే, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వచ్చి ఆమెను చూసి పోతున్నాను. కాలేజీ స్థాయినించీ మా మధ్య ఎంతటి ప్రగాఢ స్నేహముందో నీకు బాగా తెలుసు. నిజానికి మేమిద్దరం ప్రేమించుకున్నాం! ఆమె ఆరోగ్యం కుదుటపడ్డాక పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాం! అంతలో ఊహించని విధంగా నెల రోజుల క్రితం విశాలి తండ్రి దుర్మరణం పాలయ్యారు.

ఇంటి వెనక భాగంలో ఎన్నో అడుగులకింద బండ రాళ్ళమధ్య ఆయన శవం కనుగొనబడింది. ఏనాడూ ఇంటి వెనక్కి వెళ్ళని మనిషి, ఆ అవసరమే లేని మనిషి అక్కడ చచ్చిపడున్నాడంటే ఎవరికైనా అనుమానం వేస్తుంది కదా?

అందుకే విశాలి పోలీసుల్ని పిలిపించి రిపోర్టిచ్చింది. ఆయన్నెవ్వరో అక్కణ్నించి కిందికి తోసివుంటారని నిర్ణయించుకుని దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు.

తండ్రి మరణంతో విశాలి పూర్తిగా ధైర్యాన్ని కోల్పోయింది. నిన్న సాయంత్రం వచ్చి ఆమెకు అన్ని

విధాలా ధైర్యం చెప్పి, నీ విషయం కదిపాను. నువ్వు పాత మిత్రుడివే కాదు, ప్రఖ్యాత డిటెక్టివ్ దుర్యోధన్ గారివద్ద పనిచేస్తూ అపరాధ పరిశోధనలో అనేక మెళకువలు ఆకళింపు చేసుకున్నవాడివనీ, ట్రంకాల్ చేసి, నిన్నూ, దుర్యోధన్ గార్నీ ఇక్కడికి పిలిపించి, ఆమె నాన్న మరణం గురించి దర్యాప్తు జరిపించమనీ సూచించాను.

సరేనంది. ఉదయం వచ్చి చూస్తే ఇలా శవరూపంలో స్వాగతమిచ్చింది. ఆమె చిన్నాన్నా, పిన్నీ మొసలి కన్నీళ్ళు కారుస్తూ కనిపించారు."

"ఆమె మరణం గురించి డాక్టరూ, వాళ్ళూ ఏమన్నారు?"

"రాత్రి పడుకున్న మనిషి పడుకున్నట్టే గుండె బలహీనతవల్ల ఆగి మరణించిందని వారి ఫామిలీ డాక్టర్ చెబుతున్నాడు. అతని పేరు సంజీవరావు. అర్ధరాత్రి కలలోనో, భ్రాంతిలోనో తండ్రి ప్రతిరూపాన్ని చూసి వుంటుందనీ ఆమె చిన్నాన్న వాదం!

నెలరోజుల క్రితమే ఆమె తండ్రి చనిపోవడం, ఆ వెంటనే ఆమె మరణించటం అనుమానాస్పదంగా లేదూ? ఇప్పుడు విశాలి శవాన్ని సాధ్యమైనంత త్వరగా దహనం చెయ్యడానికి తొందరపడుతున్నారు వాళ్ళు. ఆ విధంగా ఆధారాలు రూపుమాసిపోతాయని.

అందుకే అంటున్నాను. శవాన్ని పోస్టుమార్టం చేయిస్తే అసలు రహస్యం బైటపడుతుందని. ఈ రెండు మరణాల వెనక విశాలి చిన్నాన్న వెంకట్రావూ, అతని భార్యల హస్తం వుందని నా గట్టి నమ్మకం!"

"ఆ మరణాలతో వారికి ఒరిగేదేమిటి?"

"మరీ అంత అమాయకంగా మాట్లాడక! విశాలి తండ్రి పుట్టుకతో ధనవంతుడు కాదు. స్వయంకృషితో, నిరంతర దీక్షతో ఈ స్థితికి ఎదిగాడు. తమ్ముడు వెంక ట్రావుని మొదటినించీ తన దగ్గరే వుంచుకుని పోషిం చాడు. పెళ్ళి చేశాడు.

అతను అన్నకు వ్యాపారంలో చేదోడు వాదోడుగా వుంటే, అతని భార్య ఇంటిపనులు చూసుకునేది. మధు సూధనరావూ, విశాలీ ఇద్దరూ మరణిస్తే ఆ ఆస్తి యావత్తూ దగ్గరి బంధువులైన వాళ్ళకేగా లభించేది?"

"నీ అనుమానాన్ని డాక్టర్ ముందు వ్యక్తం చెయ్య లేదా?"

"చేశాను. విశాలి మరణం సహజమైనదే అంటున్నా డతను. ఆ భార్యాభర్తలిద్దరూ అతన్ని బుట్టలో వేసుకుని, డబ్బుతో నోరు నొక్కేశారని నా అను మానం!"

"వాళ్ళను హంతకులుగా నిరూపించడానికి బలీయ మైన ఆధారాలు కావాలి కదా?"

"పోస్టుమార్టంలో ఆ ఆధారాలు లభించి తీరతాయి."

"చట్టపరంగా విశాలి శవాన్ని పోస్టుమార్టం చెయ్య మని కోరే ఏ అధికారమూ ఆమె ఫామిలీ డాక్టర్‌కూ, చిన్నాన్నకూ తప్ప! వారు నిరాకరించిన పక్షంలో యే న్యాయమూర్తి కూడా శవాన్ని పోస్టుమార్టం చెయ్యమని ఆదేశించజాలడు."

"తెలుసు. అందుకే నేను ఏ న్యాయమూర్తి సహా యంగానీ, పోలీసుల సహకారంగానీ అర్థించలేదు. నిన్ను వేడుకుంటున్నాను. ఈ రంగంలో నీకు మంచి అనుభవం వుంది. చట్టపరమైన లొసుగులు బాగా తెలుసు నీకు.

ఏదో ఒక మార్గం వెదకమని వేడుకుంటున్నాను" అన్నాడు ప్రదీప్ చేతులు జోడిస్తూ.

అతనిమీద జాలేసింది నాకు. మనసారా ప్రేమించి, పెళ్ళిచేసుకోవాలనుకున్న ప్రేయసి ఇలా అర్ధాంతరంగా చనిపోతే, యెంతటివాడికైనా మనసు చలించడం సహజం! ప్రదీప్ విషయంలోనూ అదే జరిగింది. అతని అవతారం చూస్తుంటే మతి చలించినవాడిలా కనిపిస్తున్నాడు.

"ఏ వైపునించి ఆలోచించినా అది సంభవంగా తోచడంలేదు ప్రదీప్! ఐనా నేను వెంకట్రావుతో మాట్లాడి ఒప్పించడానికి ప్రయత్నిస్తాను."

"ఆ విధంగా తన నేరంమీద ముసుగు తొలగిపోవడానికెవరొప్పుకుంటారు? నీకన్నా ముందు నేనే అతనితో మాట్లాడి ఒప్పించడానికి ప్రయత్నించాను. ఏమన్నాడో తెలుసా? విశాలి మరణానికి మూలకారణం మ్యూజియం గదిలో వున్న ఆమె బొమ్మేనట!"

"బొమ్మా! అదేమిటి?" అడిగాను నోరు తెరుస్తూ.

"నీకు తెలీదా? పోనీ, విశాలి నాన్నకు ఈ జంట నగరాల్లో నాలుగు పెద్ద బట్టల షాపులున్న సంగతైనా తెలుసు కదా? నగరంలోని ప్రతి బట్టల షాపులముందు నిలువెత్తు అద్దాల బీరువాలూ, వాటిలో కస్టమర్లనాకర్షించడానికి, మనిషిని పోలిన, ఐమాన్ అందమైన స్త్రీలను పోలిన బొమ్మలుంచి, వాటికి విలువైన చీరలు చుట్టి నిలబెడతారు కదా?

అలాటి అందమైన బొమ్మలెన్నో మధుసూధనరావు గారి బట్టలషాపుల ముందూ వున్నాయి. అలాటి బొమ్మలంటే ఆయనకెంతో మక్కువ వుండేది. అందుకే ఒక్కో

షాపులో నాలుగు బొమ్మలవసరమైతే వివిధ భంగిమల్లో ఎనిమిదేసి చేయించి, మిగతా వాటికి ఖరీదైన చీరలు చుట్టి, ఇంట్లో ఓ గదిని బొమ్మల మ్యూజియంగా మార్చి అందులో వాటిని అందంగా అమర్చారు.

అప్పుడే ఆయనకో ఐడియా వచ్చి, మూసపోసినట్లు తన కూతుర్ని పోలిన బొమ్మను చేయించి, దానికి విశాలి లాగే బట్టలు తొడిగించి, మ్యూజియం గదిలో మిగతా బొమ్మలమధ్య వుంచి చూసుకుంటూ మురిసిపోయేవాడు.

ఐతే, ఆ బొమ్మను చూసినప్పుడల్లా అది తనను తీవ్రంగా అసహ్యించుకుంటున్నట్టు స్ఫురిస్తుందనీ, ఏదో ఒకరోజు అది తన ఆత్మను కబళిస్తుందేమోనన్న భ్రాంతి కలుగుతుందనీ చెప్పింది విశాలి నాతో.

నవ్వి, అటువంటి అర్థంలేని భ్రమలు పెట్టుకోవద్దని కొట్టిపారేశాను. ఆ సంగతి ఆమె నాతోనేకాదు ఇంట్లో అందరితోనూ చెప్పిందేమో, ఇప్పుడామె చనిపోయింది. గనక వెంకట్రావు ఆ విషయాన్ని ఆధారం చేసుకుని ఆమె చావుకు కారణం ఆ బొమ్మే అయ్యుంటుందని అర్థం లేని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు.

లేదా, ఇంట్లో ఇద్దరు ఆత్మీయులు వెంట వెంటనే మరణించినందుకు తన మస్తిష్కం దెబ్బతిని అలా మాట్లాడుతున్నట్టు అందరూ అనుకోవాలని నాటకమాడుతున్నాడేమో!”

“ఆ విషయం తరవాత! ముందొకసారి నేనా మ్యూజియంని చూడాలి” అన్నాను ఆసక్తిగా.

“పద, చూపిస్తాను” అంటూ తలుపు తెరిచాడు ప్రదీప్.

అతన్ని అనుసరిస్తూ బైటికి నడిచాను.

3

హాలు చివర వున్న ఓ గది దగ్గరికి తీసికెళ్ళాడు ప్రదీప్. నెమ్మదిగా దాని తలుపులు తోసి, లోన అడుగు పెట్టాడు.

గది నాలుగు గోడలకూ వరసగా నిలువెత్తు అద్దాల బీరువాలు ఆనించి వున్నాయి. వాటిలో వివిధ భంగిమల్లో సజీవమూర్తులా అన్న భ్రాంతిని కలిగించే రకరకాల స్త్రీ ప్రతిమలు అమర్చి వున్నాయి.

ఒకదాంట్లో అధునాతన స్త్రీ అందమైన జుత్తుముడి వేసుకుని. చేతిలో వేనిటీ బాగ్ పట్టుకుని నిల్చుంటే, మరొకదాంట్లో పదహారణాల కుటుంబ స్త్రీ తలపై నిండుగా కొంగు కప్పుకుని అణకువగా నిల్చుంది.

వేరొక షో కేస్‌లో లంబాడీ స్త్రీ తమ ఆచార దుస్తులు ధరించి అమాయకంగా నవ్వుతోంటే, మరొకదాంట్లో నల్లని ఆదివాస స్త్రీ బ్లౌజు లేకుండా ఒంటిపై కోక చుట్టుకుని, పసివాడికి పాలిస్తూ కూర్చునుంది....

అలా ఒక్కొక్క ప్రతిమను పరిశీలిస్తూ చివరికి విడిగా, ప్రత్యేకంగా తయారుచేసిన ఓ షో కేస్ మీద నిలిచాయి నా చూపులు. అంతే! రెప్ప వెయ్యడం మరచి అలా చూస్తుండిపోయాను చాలాసేపు.

అంతక్రితం విశాలి శవాన్ని నా కళ్ళారా చూసి వుండకుంటే, అందులో నిల్చున్నది విశాలే అని భ్రమించే వాణ్ణేమో! అంత నాచురల్‌గా పోతపోసినట్టు విశాలిలా వుంది అందులోని బొమ్మ!

సాధారణంగా గొప్పింటి ఆధునిక యువతులు ఇళ్ళల్లో తొడుక్కునే పాదాలవరకూ వేళాడే గౌన్ తొడిగి వుంది ఆ బొమ్మకు. తెల్లని గౌన్ మీద చిన్నచిన్న లేత

నీలిరంగు పూలు అద్ది వున్నాయి. అప్పుడే స్నానం చేసినట్టు తడులుగా వెనక్కి జాలువార్చిన శిరోజాలు. బహుశా, నాచురల్ ఎఫెక్టు కోసం బొమ్మ తలకు ఆడవారి విగ్గు పెట్టినట్టున్నారు.

"ఇక వెళదామా?" అడిగాడు ప్రదీప్ వెనకనించి.

"పద!" అంటూ వెనుదిరగబోయి, చటుక్కున ఆగి పోయాను.

కారణం, అదే సమయంలో విశాలి బొమ్మ కళ్ళూ, కనురెప్పలూ కదిలినట్టు కనిపించాయి నాకు. దిగ్భ్రాంతిలో అవాక్కయి చూస్తుండిపోయాను. అంతక్రితం ప్రదీప్ అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

ఆ బొమ్మను చూసినప్పుడల్లా అది తన ఆత్మను కబళిస్తుందేమోనన్న భ్రమ కలుగుతున్నట్టు చెప్పిందిట విశాలి. ఇప్పుడామె మరణించింది గనక, ఆమె ఆత్మ నిజంగానే ఈ నిర్జీవ బొమ్మను ఆవహించిందా?

నెమ్మదిగా దాన్ని సమీపించి, జాగ్రత్తగా పరిశీలించాను. ఇప్పుడు నిశ్చలంగానే వున్నాయి బొమ్మ కళ్ళు! బహుశా, బైట ఏదో పక్షి ఎగిరిపోతే, కిటికీలగుండా గదిలో పడుతున్న వెలుగు చెదిరి, కళ్ళు కదిలినట్టు కనిపించాయా నాకు?

లేకుంటే బొమ్మను ఆత్మ ఆవహించడం ఏమిటి? అనుకుంటూ ప్రదీప్ వెంట బైటికి నడిచాను. "వెంకట్రావూ, అతని భార్యా, డాక్టర్ ఎక్కడ?" అడిగాను.

"దహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్చుకొస్తాను" అంటూ ఇట్లోకి నడిచాడు ప్రదీప్.

కాసేపయ్యాక ముగ్గురూ వచ్చారు నా దగ్గరికి. వారి మొహాలు విషాదానికి బదులు తొణకని నిండుకుండల్లా

గంభీరంగా వున్నాయి. నన్ను చూడగానే డాక్టర్ మొహంలో ఎందుకో చిరాకు ద్యోతకమయింది!

విశాలి చిన్నాన్న వెంకట్రావుకి సుమారు నలభై ఏళ్ళుంటాయి. సామాన్యమైన ఒడ్డూ పొడుగు. చామన ఛాయ. మనిషిలో డాంబికం కనిపించడంలేదు. ఐతే, భర్తకు భిన్నంగా భారీకాయురాలు అతని భార్య భానుమతి.

తొలిచూపులోనే తెలుగు సినిమాల్లో కనిపించే గయ్యాళి పాత్రల నటీమణుల్ని జ్ఞప్తికి తెచ్చే ముఖం! ముప్ఫైఅయిదేళ్ళుంటుంది వయసు.

ప్రదీప్ వాళ్ళకు నన్ను పరిచయంజేసి, ప్రైవేట్ డిటెక్టివ్ అసిస్టెంటుననీ, విశాలి స్నేహితుణ్ణని చెప్పగానే వారి మొహాల్లో లేత ఎరుపురంగు సంతరించి మాయమైంది!

"విశాలి మరణం సహజమైంది కాదనీ, అనుమానాస్పదంగా వుందనీ, పోస్టుమార్టం జరిపితే అసలు విషయం తెలుస్తుందనీ అంటున్నాడు ప్రదీప్. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాను వాళ్ళని.

భర్త నోరు విప్పకముందే అందుకుంది భానుమతి. "మీరూ ఆ గాలి మాటల్ని నమ్ముతున్నారన్నమాట!"

"అవి గాలి మాటలని ఎలా చెప్పగలం? పోస్టుమార్టం జరిపితే నలుగురి మనసుల్లో నాటుకున్న అనుమాన బీజాలు తొలగిపోతాయి కదా?"

"ఎవరో, ఏదో అంటున్నారని పుత్తడి బొమ్మలాంటి విశాలి శరీరాన్ని ముక్కలు చేయించమంటారా?" అంది భానుమతి తీక్షణంగా.

"దహనంచేస్తే ఆ పుత్తడి బొమ్మ కాలి బూడిద

కాదా?"

"అది ఆచారానికి సంబంధించిన విషయం! ఐనా, మాకులేని ఉబలాటం మీ కెందుకూ అంట? ముందే ధర్మరాజులాంటి బావగారూ, బంగారంలాంటి అమ్మాయి పోయినందుకు మేమేడుస్తోంటే, మధ్య్య మీ గోలకటి పోట్లేమిటీ?

మా ఫామిలీ డాక్టర్ గారు విశాలి మరణం సహజమైనదేనని నిర్ణయించారు. ఏది ఏమైనా నేను అమ్మాయి శరీరాన్ని ఖండాలు చెయ్యటానికెంతమాత్రం ఒప్పుకోను" అంది ఆమె కుండ బద్దలుకొట్టినట్టు.

"వాళ్ళతో పేచీ ఎందుకు భానూ! ముందే వర్షాకాలం! పైన మబ్బులు ముసురుకుంటున్నాయి. వర్షం వస్తే చితి అంటుకోదు. శవాన్ని త్వరగా తీసికెళ్ళడం మంచిది" అన్నాడు అంతవరకూ మౌనంగా వున్న వెంకట్రావు.

భానుమతి విజయగర్వంతో చూసింది మా వైపు. దమ్ములుంటే ఆపుకోండి చూద్దాం! అన్నట్టున్నాయి ఆ చూపులు.

"విశాలి శవంతో బాటు ఆమె బొమ్మను కూడా దహనం చేస్తే బావుంటుంది భానూ!" అన్న వెంకట్రావు మాట విని, డాక్టర్ కనుబొమలు ముడిపడ్డాయి.

"ఎందుకూ?"

"మీకు తెలీదు డాక్టర్! విశాలి బ్రతికుండగా అప్పుడప్పుడూ నాతో అనేది. ఆ బొమ్మను చూస్తే తనలో తెలియని భయం పుడుతుందనీ, అది తన ఆత్మను కబళిస్తుందేమోనని గుండె ఝల్లుమంటుందనీ చెప్పేది. నాకూ ఆ బొమ్మంటే అదోరకం జలదరింపు!"

నవ్వాడు డాక్టర్. "అతన్నీ అర్ంలేని భయాలు. నిరాధారమైన అపోహాలు. ఈ ఇంట్లో మీ అన్నయ్యకు సంబంధించిన ఆయన కూతురు విశాలికి చెందిన ఏకైక జ్ఞాపకచిహ్నం ఆ బొమ్మ. దాన్ని కూడా చేజేతులా రూపుమాపడం వివేకం కాదు!"

"నాది అర్ంలేని భయంకాదు డాక్టర్! ఆ బొమ్మ సామాన్యమైంది కాదని రూఢిగా చెప్పగలను ఎప్పుడైతే మీరు విశాలిని పరీక్షించి, మరణించిందని ప్రకటించారో, ఆమె శవాన్ని బంధుమిత్రుల సందర్శనార్థం మేడమీది పడగ్గదిలోంచి కిందికి తెచ్చి హాలు పక్కగదిలో వుంచి, ఐనవాళ్ళందరికీ ఫోన్లుచేసి, శవం వున్న గదిని సమీపిసుండగా, నా కళ్ళముందే ఆ గదిలోంచి ఆ బొమ్మ చకచకా ఇవతలికి వచ్చి, మ్యూజియం గది తలుపు తెరుచుకుని లోపలికెళ్ళిపోయింది.

ఆ దృశ్యం చూసి, దిగ్భ్రాంతితో నా కాళ్ళూ, చేతులూ ఆడలేదు చాలాసేపు. అప్పుడు మీరూ, నాఖర్లూ మేడమీద కన్నీరుమున్నీరుగా ఏడుస్తున్న భానుమతిని ఓదారుస్తున్నారు.

ఆశ్చర్యంలోంచి తేరుకుని, గబగబ శవం వున్న గదిలోకెళ్ళి చూశాను. విశాలి శవం ఎక్కడ యెలా పడుకోబెట్టామో, అలాగే వుంది. మరి నేను చూసింది భ్రమో, వాస్తవమో సరిగ్గా తేల్చుకోలేకపోయాను. ఆ సంగతి మీకు చెబితే నమ్ముతారో లేదోనని చెప్ప లేదు."

"చూడండి వెంకట్రావుగారూ! ఏ కోణంనించి పరిశీలించినా మీ కథనం వాస్తవానికి చాలా విరుద్ధంగా తోస్తోంది. నేను అన్నివిధాలా పరీక్షించే విశాలి మర

ణాన్ని ధృవీకరించాను.

బహుశా, ఆ బొమ్మ గురించి విశాలి మీతో చెప్పిన మాటలూ, దానిమీద మీరు ఏర్పరుచుకున్న భావాలూ కలగాపులగమై, ముందే అమ్మాయి చనిపోయిన సడన్ షాక్‌లో వున్న మీకు అలా బొమ్మ నడిచివెళ్ళినట్టు భ్రాంతి కలిగి వుంటుంది" అన్నాడు డాక్టర్ కొట్టిపారేసూ.

"డాక్టర్ గారు చెప్పింది నిజమే అయుండాలండీ! విశాలిలేని లోటును ఆ బొమ్మతో పూడ్చుకోవచ్చు. ఈ ఇంట్లో అది వున్నంతకాలం విశాలి మరణించిందన్న భావమే కలగదు మనకు....అవతల మబ్బులు ఉరుముతున్నాయి. ముందు దహన సంస్కారాల సంగతి చూద్దాం పదండి" అంది భానుమతి తొందరపెడుతూ.

వారి నక్కజిత్తులు చూస్తుంటే ఒళ్ళు మండిపోయింది నాకు. కానీ, ఏం చెయ్యాలి? ఏం చెయ్యడానికీ చట్టపరంగా నాకు అధికారం లేదాయె. వాళ్ళు వెళ్ళిపోగానే చివరి ప్రయత్నంగా డాక్టర్ని వేడుకుందామని అతనివైపు తిరిగాను.

నేను పెదవి కదపకముందే అతను నిట్టూర్చి, "విశాలిని కాపాడటానికి శక్తివంచనలేకుండా ప్రయత్నించాను. ప్చ్! లాభం లేకపోయింది. ఈ వయసులోనే భగవంతుడామె ఆయుఃషుకు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. చావుపుట్టుకలు మన చేతిలోనివా?" అన్నాడు వేదాంతధోరణిలో.

"నిజమే! కానీ, ఒకరి చావుకు కారణాలు కనుగొనే అధికారం చట్టరీత్యా మీ చేతిలో వుంది. విశాలి శవాన్ని పోస్టుమార్టం చేయించి, ఆమె చావుకు కారణం ఏమిటో

తెలుసుకుంటే బావుండేది."

"అంటే, మీ ఉద్దేశంలో నేను నా విద్యుక్త ధర్మంలో నిర్లక్ష్యంగా వుంటాననా? ఎప్పుడు యేది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో మీరు నాకు నేర్ప నవసరంలేదు. పోస్టుమార్టం అవసరమైతే ఇంతవరకూ రానిచ్చేవాణ్ణా? విశాలి మరణం గుండె ఆగిపోవడంవల్ల జరిగింది. దట్సాల్!" అంటూ చరచరా శవం వున్న గదివైపు నడిచాడు డాక్టర్.

ప్రదీప్ వైపు చూసి నిట్టూర్చాను ఇక చేసేదేమీ లేనట్టు!

4

స్మశానంలో విశాలి శవానికి దహన సంస్కారాలు పూర్తిజేసి, ఇల్లుజేరేసరికి సంజెచీకట్లు ముసురుకున్నాయి. అప్పటికే ఆ ఇంట్లో అల్ప వ్యవధిలోనే అనూహ్య స్థితిలో తండ్రీ కూతుళ్ళ మరణాలు సంభవించడంతో బంధు మిత్రులు జడిసి, ఆ ఒక్క రాత్రి కూడా అక్కడ బస చెయ్యడానికి భయపడి మూటా ముల్లె సర్దుకుని వెళ్ళి పోయారు.

ఏడున్నర ప్రాంతంలో ప్రారంభమైంది వర్షం!

భారీ వర్షం!!

ఇక ఆ ఇంట్లో నేనూ, ప్రదీప్, వెంకట్రావూ, భాను మతీ తప్ప మరెవ్వరూ లేరు. ప్రదీప్ పరిస్థితి చాలా దయనీయంగా వుంది. కళ్ళు గుంటలుపడి, మొహం పీక్కుపోయి, జుత్తంతా చెదిరి పిచ్చివాడిలా కనిపి స్తున్నాడు.

అందరిలా మేమిద్దరమూ యెప్పుడు బైటకెళతామా అని ఎదురుచూస్తున్నారు వెంకట్రావూ, భానుమతీ!

డిటెక్టివ్ దుర్యోధన్ గారి సాంగత్యంవల్ల సంతరించు కున్న నా అనుభవం, ఆ ఇంట్లో ఎక్కడో, యేదో అనూహ్యమైన మర్మం దాగివుందని పదేపదే హెచ్చరిస్తోంది నన్ను.

అందుకే అన్నాను కావాలని. "నేను వెళ్ళాల్సిన మద్రాసు విమానం రేపుదయం తొమ్మిది గంటలకు బైలు దేరుతుంది. అందులో వెళ్ళిపోవాలనుకుంటున్నాను. ఈ రాత్రి ఇక్కడే గడిపి."

భానుమతి మొహం చిటపటమంది అయిష్టంతో. ఐనా, మర్యాదకోసం నోరు విప్పలేదు.

"అలాగే, దానికేం భాగ్యం! మరో రెండు రోజు లుండి వెళ్ళండి. మేడపైన అన్నయ్యగది ఖాళీగా వుంది. మీ బసకోసం వాడుకోండి" అన్నాడు వెంకట్రావు.

"థాంక్స్!" అంటూ ప్రదీప్ వైపు తిరిగి, "నువ్వు బాగా అలిసిపోయినట్టున్నావు. ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకో. రేపుదయం కలుసుకుందాం!" అన్నాను.

"అలాగే! వస్తాను. గుడ్ నైట్" అంటూ నీరసంగా బైటికి నడిచాడు ప్రదీప్.

"మా ఆకలి చచ్చిపోయింది. మీరు భోంచేస్తానంటే ఏర్పాటుచేస్తాం! సమయానికి నౌఖర్లు కూడా లేరు. స్మశానంనించే ఇంటికెళ్ళిపోయారు" అన్నాడు వెంక ట్రావు.

"అబ్బే, ఈ పరిస్థితిలో ఆకలి కూడానా! స్నానంచేసి, విశ్రాంతి తీసుకోవాలి. గది చూపించండి" అన్నాను.

"మీరు స్నానం చేసేలోగా పాలుకాచి పంపిస్తాను" అంది భానుమతి. వెంకట్రావు మేడమీదికి దారితీశాడు. సూట్ కేస్ అందుకుని, అతన్ని అనుసరించాను. మేడమీది

ఓ గదిలోకి తీసికెళ్ళి, "అదే అన్నయ్య గది, బాత్ రూం కూడా వుంది లోపల" అన్నాడు.

సూట్ కేస్ టేబిల్ మీద పెట్టి, "థాంక్స్!" అన్నాను.

"స్నానం చెయ్యండి. పాలు పట్టుకొస్తాను" అంటూ వెళ్ళిపోయాడతను. తలుపు దగ్గరగా వేసి, బట్టలు విప్పి, లుంగీ చుట్టుకుని, టవల్, సోప్ తో బాత్ రూంలోకి నడిచాను. షవర్ కింద తృప్తిగా స్నానంచేసి, చారల చొక్కా నైట్ పైజామా తొడుక్కున్నానో లేదో, ట్రేలో పెద్ద సైజు పాలగ్లాసూ, ఓ బిస్కెట్ పాకెట్టూ పట్టుకొచ్చి, "ఈ రాత్రికి వీటితో సరిపుచ్చుకోండి" అన్నాడు వెంకట్రావు.

"ఫరవాలేదు. అనవసరంగా మిమ్మల్ని శ్రమపెడు తున్నాను."

"ఇట్స్ ఆల్ రైట్! గుడ్ నైట్!" అంటూ బైటికి నడిచాడు.

తలుపు మూసి, పాలగ్లాసందుకున్నాను. బిస్కెట్లు తినబుద్ధి కాలేదు. పాలు తాగి, సిగరెట్ అంటించి' బాల్కనీవైపు నడిచాను. అక్కణ్నించి చూస్తే ఇంటి వెనకభాగం, దూరాన కనుచూపుమేరవరకూ నగరంలో వెలుగుతున్న విద్యుద్దీపాలూ కనులకింపుగా కానవస్తు న్నాయి.

ఇప్పుడు వర్షం తగ్గుముఖం పట్టింది. సన్నని తుంపరగా పడుతోంది. చేతి గడియారం చూసుకున్నాను. ఎనిమి దిన్నర. సిగరెట్ పీకను బాల్కనీగుండా అవతలికి విసిరి, మంచంవైపు నడిచాను. గదిలోని లైటార్పి, జీరోవాల్టు వెలిగించి, పక్కమీద వాలాను.

ముందే కొత్త ప్రదేశం! పైగా అనూహ్య ఘటనలతో నిండిన గృహం! ఎలా పడుతుంది నిద్ర? తీవ్రాలోచనలతో సతమతమౌతూ, పక్కపై అటూ ఇటూ వత్తిగిలుతూ దాదాపు రెండుగంటలు తంటాలుపడ్డా నిద్రపట్టకపోయేసరికి, ఇహ లాభంలేదని లేచి కూర్చున్నాను మంచంమీద.

అక్కణ్ణించి బాల్కనీగుండా బైటి దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు ఆకాశంలో మబ్బులు పూర్తిగా పల్చబడ్డాయి. ఆ మబ్బుల్లోంచి వెన్నెలకూడ వెలికివచ్చి, పరుచుకుంది పరిసరాలపై.

మసకచీకట్లో కూర్చుని అటు చూస్తున్న వాణ్ణల్లా ఒక్కసారి ఉలిక్కిపడ్డాను! కారణం, బైట ఇంటివెనక ఏదో తెల్లని ఆకారం కదులుతున్నట్టు కనిపించింది! ఒక్క ఉదుటున మంచం దిగి బాల్కనీ దగ్గరికి నడిచాను. ఇప్పుడా ఆకారం స్పష్టంగా కనిపిస్తోంది.

నడకను బట్టి ఇట్టే పోల్చుకున్నాను. అది స్త్రీ ఆకారం! ఇప్పుడా ఇంట్లో నేనూ, వెంకట్రావూ, భానుమతీ తప్ప మరెవ్వరూ లేరు. కొంపదీసి భానుమతి గాక ఇంట్లో మరో స్త్రీ కూడా వుందా? లేక ఆమె భానుమతేనా?

ఔను. భానుమతే! ఒడ్డూపొడుగు అలాగే వున్నాయి కోడ్ కోల్లర్రా! అరరాత్రిపూట ఇంటివెనక్కి ఎందుకొచ్చిందామె? ఏం చెయ్యడానికి? ఊపిరి బిగబట్టి ఆశ్చర్యంతో అటే చూడసాగాను. గదిలో లైటార్పడం చాలా మంచిదయింది. లేకుంటే, బాల్కనీలో నిల్చున్న నన్ను ఆమె తప్పక చూసివుండేది.

వడివడిగా నడుస్తూ కొంత దూరంలో అడ్డదిడ్డంగా పెరిగిన సీతాఫలాల చెట్లవైపు వెళుతోంది భానుమతి.

సరిగ్గా అక్కడే, కింద అగాధంలోపడి చనిపోయాడట విశాలి తండ్రి మధుసూధనరావు. ఆ సంగతి తెలిసీ, అర్ధరాత్రి అంత నిర్భయంగా భానుమతి అక్కడికెందుకెళుతోంది?

ఆలోచిస్తున్న వాణ్ణల్లా ఒక్కసారి తృళ్ళిపడ్డాను. భానుమతిని అనుసరిస్తూ ఇప్పుడు మరో ఆకారం వచ్చింది ఇంటి వెనక్కి! కళ్ళు చిట్లించి చూశాను. అది కూడా స్త్రీ ఆకారమే!

పాదాలవరకూ వేళాడుతున్న తెల్లని గౌను. భానుమతికన్నా రెండు మూడంగుళాలు పొట్టిగా, సన్నంగా వున్న ఆ ఆకారాన్నీ ఆ గౌన్నీ అదివరకెక్కడో.... గుర్తు రాగానే గుండె ఝల్లుమంది!

విశాలి!!

కొన్ని గంటలక్రితం నా కళ్ళముందు స్మశానంలో దహనం చెయ్యబడ్డ విశాలి, ఇప్పుడు సజీవంగా.... ఏమిటీ మాయ? ఎలా సంభవమిది? కళ్ళు నులుపుకుని చూశాను. సందేహానికి ఆస్కారంలేదు.

విశాలే!

అప్పుడు గింగురుమన్నాయి నా బుర్రలో వెంకట్రావు అన్న మాటలు.

'విశాలి ఆత్మ ఆ ప్రతిమను ఆవహించింది....'

చూస్తుండగానే ఆ రెండు ఆకారాలూ ఒకదాని వెనక ఒకటి సీతాఫలచెట్ల వెనక్కి వెళ్ళిపోయాయి. అంతే! మరుక్షణం దిక్కులు పిక్కటిల్లేలా పెద్ద ఆర్తనాదం వినిపించింది! నా గుండెలో గుఱ్ఱాలు దౌడు తీశాయి.

మరేమీ యోచించకుండా వెనుదిరిగి, తలుపువైపు

పరుగెత్తాను. గడియతీసి, భళ్ళున తలుపు తెరిచి, వేగంగా మెట్లు దిగి హాల్లోకి చేరుకున్నాను. ఆ ఖంగారులో తెరిచి వున్న హాలు తలుపు నన్ను ఆశ్చర్యపర్చలేదు.

ఒక్క ఉదుటున బైటపడి, కుడివైపునించి చుట్టు తిరిగి మేడ వెనక్కి పరిగెత్తాను. సరిగ్గా అదేక్షణంలో గౌన్ తొడుక్కున్న తెల్లని ఆకారం ఎడంవైపునించి వేగంగా మేడ ముందుభాగంవైపు వెళుతూ కనిపించింది.

"ఏయ్ .... యెవరు నువ్వు .... ఆగు ...." అరిచాను గట్టిగా.

ఆ ఆకారం ఆగలేదు. వెనుదిరిగి చూడలేదు. త్వర త్వరగా నడుస్తూ నా దృష్టికి దూరమైపోయింది. అప్పుడు తెలిసి వచ్చింది నేను చేసిన పొరపాటు. హడావుడిలో సూట్‌కేస్‌లోంచి నా రివాల్వర్, టార్చిలైటూ తేవడం మర్చిపోయాను.

ఆ గావుకేక ఎవరిది? భానుమతిదా? ఏం జరిగిందామెకు? ఇప్పుడా ఆకారాన్ని వెంబడిస్తూ పోతే, అవతల భానుమతికేదైనా అవాంతరం ముంచుకొచ్చి వుంటే సమయానికి ఆదుకోలేను. అందుకే మరేమీ ఆలోచించకుండా సీతాఫలాల చెట్లవైపు పరుగుతీశాను.

ఆ చెట్లకు నాలుగడుగుల అవతలే ఉంది అగాధం! భానుమతి జాడ లేదక్కడ! జాగ్రత్తగా చూసుకుంటూ కొండ చివర నిల్చుని, కిందికి చూశాను. మరీ అంత లోతు లేకున్నా అక్కణ్ణించి ఎవరైనా తలకిందులుగా పడితేమాత్రం బ్రతకడం కష్టం!

నా అనుమానం నిజమే అయింది. కింద తొలచిన బండరాళ్ళమీద పడుంది ఓ ఆకారం! "భానుమతిగారూ!

భానుమతిగారూ!" పిల్చాను గట్టిగా.

జవాబు లేదు.

అటూ ఇటూ చూశాను. ఓ చోట కిందికి దిగడానికి అనువైన చోటు కనిపించింది. అటువెళ్ళి జాగ్రత్తగా రాళ్ళను పట్టుకుంటూ అతికష్టంమీద చేరుకోగలిగా నక్కడికి. ఆ ఆకారం పడున్న ప్రదేశాన్ని సమీపించి, వంగి చూశాను పరీక్షగా. భానుమతే!

బోర్లా పడుంది రాళ్ళపై. తల చితికి రక్తం మడుగు కట్టింది. చటుక్కున చెయ్యందుకుని పల్స్ చూశాను. గుండె గుభిల్లుమంది. అది చెయ్యికాదు. ఐస్ ముద్ద! మెడ ఎముక విరిగిందేమో! వెంటనే ప్రాణం పోయింది.

ఇంత రాత్రివేళ ఆమె ఇక్కడికి రావడానికి కారణం? అదే అంతుచిక్కని మర్మం! ఆలోచిస్తూ అనవసరంగా కాలయాపన చెయ్యకూడదు. వచ్చిన దారినే తిరిగి పైకి చేరుకుని పరుగుతీశాను ఇంటివైపు.

హాల్లో అడుగుపెట్టి, గబగబ మ్యూజియం గదివైపు నడిచాను. దగ్గరగా వేసున్నాయి తలుపులు. బైటగడియ పెట్టలేదు. దడదడలాడే గుండెతో మెల్లగా తోశాను. కిర్రుమంటూ తెరుచుకుంది.

అగ్గిపుల్ల గీసి, నెమ్మదిగా అడుగుపెట్టాను లోన. తలుపు పక్కనే వున్న స్విచ్ వత్తి లైటు వెలిగించాను. యెదురుగా షో కేస్‌లో యథాప్రకారం నిశ్చలంగా నిల్చున్న విశాలి బొమ్మను చూడగానే, నేనూ కాసేపు కొయ్యబారి పోయానా ప్రతిమలా!

తరవాత తేరుకుని, షో కేస్‌ని సమీపించి, ఆ ప్రతిమ పాదాలను పరిశీలించాను. ఎటువంటి మట్టిమరకలూ లేవు! మరి నేను చూసిందేమిటి? కలగన్నానా? ఆలోచిస్తూ

వెనుదిరిగి, హాల్లోకి నడిచాను.

సరిగ్గా ఆదే సమయంలో పైనించి ఖంగారుగా మెట్లు దిగుతూ కనిపించాడు వెంకట్రావు. "భానుమతి ఎక్కడ? ఆ కేకేమిటి? వెళ్ళి చూశారా?" అడిగాడు ఆందోళనగా.

"మీ భార్య బైటికెళ్ళిన సంగతి తెలియదా మీకు?" అడిగాను అతన్ని పరీక్షగా చూస్తూ.

"తెలీదు. నిద్రలో వున్నాను. హఠాత్తుగా ఏదో అలికిడై నిద్ర మేల్కొని చూస్తే పక్కలో లేదు. అనుకోకుండా బాల్కనీలోంచి బైటికి చూసి ఆశ్చర్యపోయాను. భానుమతి ఇంటి వెనక చెట్లగుబురు వైపు వెళుతోంది...."

సాలోచనగా తలూపాను. "డాక్టర్ సంజీవరావుకు ఫోన్ చెయ్యాలి. నెంబర్ చెప్పండి."

"సిక్స్ వన్ డబుల్ త్రీ ఫోర్ నైన్!"

ఫోన్ వైపు అడుగు వేశాను.

"అర్జున్ గారూ!"

ఆగి, అతని వైపు చూశాను.

"విశాలి బొమ్మ భానుమతిని ఎందుకు వెంబడించింది? ఆ గావుకేక ఎవరిది?"

"తెలుస్తుంది. కొద్దిసేపట్లో అంతా తెలుస్తుంది. ఓపిక పట్టండి," అంటూ ఫోన్ దగ్గరికి నడిచి, దానిపక్కనే వున్న టెలిఫోన్ డైరెక్టరీ అందుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కూ, డాక్టర్‌కూ, ప్రదీప్‌కూ ఫోన్లు చేశాను.

5

"అదే ప్రదేశంలో మరో మరణం! అదీ అర్ధరాత్రి వేళ ఆవిడ అక్కడికెందుకెళ్ళింది?" అడిగాడు ఇన్

స్పెక్టర్ అయోమయంగా.

నేను ఫోన్ జేసిన అరగంట తరవాత ముందు పోలీసులూ, తరవాత ప్రదీప్, డాక్టర్ హుటాహుటిన వచ్చేశా రక్కడికి. పోలీసులు ఇంటి వెనక భాగాన్నీ, భానుమతి పడున్న ప్రదేశాన్నీ తీక్షణంగా పరిశీలించారు.

ఇంటి వెనక నేలపై తివాసీ పరిచినట్టు పచ్చగడ్డి ఉన్నందువల్ల భానుమతి అడుగుల గుర్తులుగానీ, ఆమె ననుసరించి వెళ్ళిన స్త్రీ పాద ముద్రలుగానీ యెక్కడా కనిపించలేదు. శవాన్ని పైకి తెచ్చి, అంబులెన్స్‌లో పోస్టుమార్టంకోసం పంపేశారు పోలీసులు.

భార్య మరణించిన సంగతి తెలియగానే గుండెలు బాదుకుంటూ రోదించాడు వెంకట్రావు. అతన్ని శాంత పర్చడానికి మా తల ప్రాణం తోకకొచ్చింది.

ఇన్‌స్పెక్టర్‌కు వివరించాను, నేను చూసిందీ, జరిగిందీ.

అది విన్నాక అతని కళ్ళు మెరిశాయి. "ఆమెను అనుసరిస్తూ ఆ చెట్లవైపు మరో స్త్రీ ఆకారం కూడా వెళ్ళిందంటున్నారు. ఎవరామె? ఈ ఇంట్లో మరో స్త్రీ కూడా ఉందా?"

"లేదు! బొమ్మ....ఆ బొమ్మే నా భార్య ప్రాణం తీసింది...." అన్నాడు వెంకట్రావు రుద్ధ కంఠంతో.

"బొమ్మా! ఎవరా బొమ్మ?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

వెంకట్రావు తన ధోరణిలో చెప్పుకుపోతున్నాడు. "నేను ముందే హెచ్చరించాను. ఎవ్వరూ నమ్మలేదు నా మాట. భానుమతి కూడా! విశాలి చనిపోగానే ఆమె ఆత్మ ఆ బొమ్మను ఆవహించింది. ఇప్పుడది మామూలు ప్రతిమ కాదు. ప్రాణం వచ్చిన ప్రతిమ!"

"మీరు చెప్పేదేమిటో నాకర్థం కావడంలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అయోమయంగా.

"వాస్తవాన్ని కప్పిపుచ్చడానికీ, మిమ్మల్ని తప్పుదోవ పట్టించడానికీ ఏదో కాకమ్మ కథ కల్పించి చెబుతున్నాడండి. బొమ్మేమిటీ? ప్రాణం రావడం ఏమిటీ? ఆయన భార్యను చంపడమేమిటీ? రండి చూపిస్తాను మీకా బొమ్మను. అప్పుడైనా తెలుస్తుంది ఆయన చెప్పేదేమిటో!" అంటూ గబగబ మ్యూజియం గదివైపు నడిచాడు ప్రదీప్.

అందరం అతన్ని అనుసరించాం! మ్యూజియం తలుపు తెరిచి, లోన లైటు వేశాడు ప్రదీప్. అందులో అడుగు పెట్టాక, "అదుగో, ఆ బొమ్మ గురించే ఇందాక ఈయన గారు చెప్పింది" అన్నాడు ప్రదీప్ షో కేస్ వైపు చూపుతూ.

ఇన్‌స్పెక్టర్ అడుగులో అడుగు వేసుకుంటూ దాన్ని సమీపించి, అందులోని ప్రతిమను కాసేపు పరిశీలించి, వెంకట్రావు వైపు చూశాడు అనుమానంగా.

తరవాత నా వైపు తిరిగి, "భానుమతిగార్ని వెంబడిస్తుండగా మీరు చూసిన బొమ్మ ఇదేనా?" అడిగాడు వ్యంగ్యంగా.

"ఇదేనని నేననలేదు. ఒడ్డూపొడుగూ, తొడుక్కున్న గౌనూ అచ్చం ఇలాగే వున్నాయన్నాను."

"మీరుగాక కేవలం వెంకట్రావే తన భార్యనెవ్వరో వెంబడించడం చూశానని చెప్పివుంటే, మతి స్థిమితం తప్పి అతనలా అంటున్నాడనుకునేవాణ్ని. మీరూ అతని వాదనను బలపరుస్తున్నారు గనక అంతా అయోమయంగా వుంది.

ఈ ప్రాణంలేని ప్రతిమ ఏమిటి? ఆయన భార్యను వెంబడించడం ఏమిటి? ఇది కేవలం అపోహ అయితే, మరి మీరిద్దరూ చూసిన ఆ రెండో స్త్రీ ఎవరు? ఆమెను భానుమతిని చంపే అవసరం ఏమిటి?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మీ ప్రశ్నలకు వీళ్ళెవరూ జవాబివ్వలేరు. జరిగిందేమిటో నేను చెబుతాను వినండి. ఒక పద్ధతి ప్రకారం తండ్రీ కూతుళ్ళని మాతమార్చి, ఆ ఆస్తినంతా హస్తగతం చేసుకోవాలని వెంకట్రావూ, భానుమతీ కలిసి పథకం వేశారు.

నెలరోజుల క్రితం విశాలి తండ్రిని ఏదో నెపంతో ఇంటి వెనక్కి తీసికెళ్ళి, కిందికి తోసి చంపేశారు. తరవాత నిన్న విశాలికి విషంపెట్టి చంపేశారు.

స్త్రీలలో సహజసిద్ధంగా పాపచింతన రొయ్యక. భానుమతి అంతరాత్మ పదేపదే చేసిన పాపాన్ని కెలుకుతూ, ఏదో ఒకరోజు తగిన ప్రాయశ్చిత్తం అనుభవించక తప్పదని హెచ్చరించి వుంటుంది.

ఆ మానసిక వత్తిడిని తట్టుకోలేక, ఆమె స్వయంగా లేచివెళ్ళి, ఇంటి వెనక అగాధంలోకి దూకి ఆత్మహత్య చేసుకుందేమో.... లేదా, వెంకట్రావే ఆమెను అక్కడికి పదమని చెప్పి తానే వెనకనించి తోసి చంపి వుంటాడు.

మొదటినించీ ఆమె ముక్కోపి. మొంటిఘటం. అతన్ని రాచి రంపాన పెట్టేది. ఆమెతో వేగలేక, రెండు హత్యల రహస్యం తెలిసిన తన భాగస్వామిని మట్టుపెట్టాలనీ అతనే ఆమెను చంపినా ఆశ్చర్యంలేదు" అన్నాడు ప్రదీప్ ఉద్వేగంతో.

అటువంటి నిందారోపణలు విన్నాక ఎంతటి బల

హీనుడైనా ఎగిరి తంతాడు ఎదటి మనిషిని. వెంక ట్రావులో కోపతాపాలు ఉత్పన్నం కావడానికి బదులు-

"నా భార్యను ఆ బొమ్మే చంపింది. అర్జున్ గారు కూడా చూశారు అది భానుమతి వెనక వెళ్ళడం!" అన్నాడు రుద్ధ కంఠంతో.

తలూపాడు ఇన్‌స్పెక్టర్. "ఔను. హంతురాలిని వెంబడిస్తూ గౌను తొడుక్కున్న మరో స్త్రీ కూడా వెళ్ళడం ఈయన కళ్ళారా చూశానంటున్నారు. మరి ఆ మిస్టరీ ఏమిటి?"

"వెరీ సింపుల్! వెంకట్రావుని చూడండి. అతి సామాన్యమైన ఒడ్డూపొడుగు. నెత్తిన లేడీస్ విగ్ పెట్టుకుని, గౌను తొడుక్కుని దూరాన చీకట్లో నడిస్తే ఎవరైనాసరే స్త్రీగా భ్రమిస్తారు. అలాగే, అర్జున్ని మభ్యపెట్టడానికి విగ్గు పెట్టుకుని, గౌను తొడుక్కుని, భానుమతి వెనక వెళ్ళుంటాడు."

"అసంభవం! వెంకట్రావు దగ్గర అంత వ్యవధి లేదప్పుడు. పైగా, ఆయన నడకకూ, నేను చూసిన స్త్రీ నడకకూ చాలా వ్యత్యాసం వుంది" అన్నాను మధ్యలో.

రిస్టువాచీ చూసుకున్నాడు ఇన్‌స్పెక్టర్. "రాత్రి రెండు దాటింది! మీ ఇద్దరి వితండ వాదాన్ని చాలా కూలంకషంగా పరిశీలించాక నే సరైన అవగాహనకు రావాలి. ఉదయం క్రైంబ్రాంచి ఇన్వెస్టిగేటర్లతో సహా మా ఉన్నతాధికార్లు చాలామందే రావచ్చిక్కడికి.

అంతవరకూ మీలో ఎవ్వరూ అనుమతిలేనిదే నగరం విడిచి వెళ్ళకండి. వస్తాను" అంటూ మా వద్ద సెలవు తీసుకుని బైటికి నడిచాడు ఇన్‌స్పెక్టర్. పోర్చ్‌లో ఆగి వున్న పోలీస్ జీప్ స్టార్టయి వెళ్ళిపోయింది.

6

డాక్టర్ నన్నూ, ప్రదీప్‌నూ పక్కకి తీసికెళ్ళి, "వెంకట్రావు మానసిక స్థితిబాగా బ్రేక్‌డౌన్ అయినట్టుంది. అతన్ని పైకి తీసికెళ్ళి, నిద్రపోడానికి మందిచ్చి పడుకోబెట్టి వస్తాను" అన్నాడు.

"అంతా నాటకం! మనల్ని బోల్తా కొట్టించటానికి ఆడుతున్న బూటకం!" అన్నాడు ప్రదీప్ మొహం చిట్లిస్తూ.

"విశాలి మరణంతో నీ మనస్థిమితం ఎలా బ్రేక్‌డౌన్ అయిందో, భార్య హఠాన్మరణం అతని మనసును కూడా అలాగే దెబ్బతీసింది. పరిస్థితిని సరిగ్గా అర్థంచేసుకోడంలేదు నువ్వు. అతన్ని మేడమీద పడుకోబెట్టి వస్తానుండండి" అంటూ వెంకట్రావు భుజంమీద చెయ్యివేసి, మెట్లవైపు నడిచాడు డాక్టర్.

"ఎంతైనా వాళ్ళ తొత్తువే కదా నువ్వు. వాణ్ని వెనకేసుకురాక ఏం చేస్తావు!" అంతవరకు మసులుతున్న డాక్టర్ మీది అక్కసంతా వెళ్ళగక్కాడు ప్రదీప్.

అతన్ని డ్రాయింగ్ రూంలోకి తీసికెళ్ళి కూర్చోబెట్టాను.

"అరుణ్! ఇన్‌స్పెక్టర్ ముందు వెంకట్రావు కట్టుకథను ఎందుకు బలపర్చావో నాకర్థంకావడంలేదు. ఇంట్లో భానుమతి తప్ప మరో స్త్రీ లేనప్పుడు ఆమెను వెంబడిస్తూ ఎవరు వెళతారు?"

"నువ్వు నమ్మినా, నమ్మకున్నా నేను చూసింది మాత్రం నిజం! ఇన్‌స్పెక్టర్ ఎగతాళి పట్టిస్తాడని చెప్పలేదు కానీ, భానుమతిని వెంబడించిన ఆకారాన్ని చూసిన మరుక్షణం విశాలి బ్రతికి వచ్చిందా అన్న భ్రమ కలిగింది నాకు.

ఆమెను మన కళ్ళముందే దహనం చేశారు గనక, వెంకట్రావు అన్నట్టు ఆ బొమ్మకే ప్రాణంవచ్చి భాను మతిని చంపేసిందా అనిపిస్తోంది!"

"అర్థంపర్థం లేకుండా వాగి, నాకు కోపం తెప్పించక! నీ వాదాన్ని ఈ ఆధునిక జగత్తులో ఎవరైనా నమ్ము తారా? నమ్మడం అటుంచి పగలబడి నవ్వుతారు. నువ్వు చదువుకున్న వాడివి. పైగా, అపరాధ పరిశోధకుడివి. నువ్వే ఇలా మాట్లాడుతుంటే, నీ తెలివితేటలమీద జాలే స్తోంది నాకు."

నేను జవాబిచ్చేలోగా డాక్టర్ వచ్చాడక్కడికి. "వెంకట్రావుకు మత్తుమందిచ్చి పడుకోబెట్టాను. అల సటగా వుంది. వెళ్ళి విశ్రాంతి తీసుకుంటాను. ప్రదీప్! ఇక్కడే వుంటావా నువ్వు?" అడిగాడు.

"అర్జున్‌తో మాట్లాడి వస్తాను. మీరు వెళ్ళండి."

డాక్టర్ నా వైపు చూసి, "మిస్టర్ అర్జున్! ఇలా రండి!" అన్నాడు.

లేచి ఆయన వెంట బైటికి నడిచాను. పోర్చ్‌లో ఆగి వుంది ఆయన కారు.

సిగరెట్ అంటించి, రెండు దమ్ములులాగి, అడిగాడు, "మీరు నిజంగా భానుమతిని వెంబడిస్తూ ఏదైనా ఆకా రాన్ని చూశారా?"

"ఔను. అంతేకాదు. ఆ ఆకారం విశాలి బొమ్మదేనని కూడా అనుమానంగా వుంది."

డాక్టర్ నవ్వి—"చూడండి. ఈనాటి విజ్ఞానం ఎటి పరిస్థితిలోనూ మీ వాదాన్ని నమ్మదు. ఐతే, ఈ విష యంలో ఓ సూచన మాత్రం ఇవ్వగలను. కొందరు ఒక రకం మానసిక రుగ్మత కారణంగా తాము ఊహించు

కుంటున్నదల్లా ప్రత్యక్షంగా వీక్షిస్తున్నట్టే అనుభూతి చెందుతారు.

ఇంట్లో విశాలి శవాన్ని మీరు కళ్ళారా చూశారు. తరవాత స్మశానంలో ఆమె అంత్యక్రియలు కూడా చూశారు. కాలి బూడిదైన మనిషి ఆత్మ జీవంలేని బొమ్మలో విలీనం కావడం హాస్యాస్పదం కాదా?"

"మరి వెన్నెల వెలుగులో నేను చూసిందేమిటి?"

"గదిలో మీరు ఒంటరిగా వున్నారు. మీ మస్తిష్కంలో విశాలి రూపమూ, ఆమె గురించిన ఆలోచనలు తప్ప మరో ధ్యాసలేదు. భానుమతి కనిపించిన వెంటనే ఆమె వెనక విశాలి కూడా నడిచివెళ్ళినట్టు మిమ్మల్ని భ్రాంతికి గురిచేసింది మీ మస్తిష్కం! వెంకట్రావు విషయంలో కూడా సరిగ్గా ఇలాగే జరిగుంటుంది. సరే, వస్తాను. సీయూ!" అంటూ కారెక్కి స్టార్టుచేశాడు డాక్టర్.

కారు మెయిన్ గేటుదాటి నా దృష్టికి దూరమయ్యేవరకూ అక్కడే నిల్చున్నాను.

7

నెమ్మదిగా హాల్లోకెళ్ళి, డ్రాయింగ్ రూంలో అడుగు పెట్టాను. ప్రదీప్ నీరసంగా అలాగే కూర్చునున్నాడు సోఫాలో.

నన్ను చూడగానే, "ఏమన్నాడు డాక్టర్?" అడిగాడు.

నేను చెప్పడానికి నోరు తెరిచాను. అంతే!

పైన మేడమీంచి ఒళ్ళు జలదరించి గావుకేక వినిపించింది!

ఇద్దరం ఉలిక్కిపడ్డాం!! అది వెంకట్రావు కంఠం!

"ప్రదీప్! హారియప్!" అంటూ తలుపువైపు పరుగు తీశాను.

ఇప్పుడు పైనించి గట్టిగా మూలుగులు వినిపిస్తున్నాయి. ప్రదీప్ కూడా భయ విహ్వాలుడై నా వెనక పరుగుతుకొచ్చాడు. ఇద్దరం ఆదరాబాదరా మెట్లెక్కి మేడ మీదికి చేరుకున్నాం! వెంకట్రావు గది తలుపు మూసి వుంది. అంతవరకూ వి ని పి స్తు న్న మూలుగులు ఇప్పుడు స్తంభించిపోయాయి.

గట్టిగా తోశాను తలుపుని. భళ్ళున తెరుచుకుంది. ఇద్దరం లోనికురికి నిర్ఘాంతపోయాం! వెంకట్రావు మంచం మీద వెల్లకిలా పడున్నాడు. గుండెలో పిడివరకూ దిగి వుంది బాకు! అతని కుడి చెయ్యి ఆ బాకు పిడిని పట్టుకునుంది.

మెరుపులా మంచాన్ని సమీపించి అతని పల్స్ చూశాను.

స్తంభించి పోయింది!

"ఆత్మహత్య!" ప్రదీప్ కంఠం వణికింది. "అన్ననూ, విశాలినీ, భార్యనూ, చంపాక పట్టుబడతానేమోనన్న భయంతో, పాప భీతితో ఇతని మతి చలించింది. ఈ రాత్రి భార్యను చంపాక తన అంతరాత్మ నోరు నొక్కడంలో విఫలుడై విరక్తి చెంది తనను తానే పొడుచుకున్నాడు."

"డాక్టర్ ఇందాకే చెప్పి వెళ్ళాడు కదా ఇతనికి మత్తుమందిచ్చి నిద్రపుచ్చానని! మత్తుమందు ప్రభావంతో నిద్రపోతున్న వ్యక్తి ఆత్మహత్య ఎలా చేసుకోగలడు? నిస్సందేహంగా ఈ పని విశాలి ప్రతిమే చేసివుంటుంది!" అంటూ గబగబ తలుపు దగ్గరికి పరుగెత్తి, నడవాలో

అటూ ఇటూ తొంగిచూశాను, ఎవరూ లేరు!

ప్రదీప్ వైపు తిరిగి, "నేను డాక్టర్ వెంట పోర్చ్‌లోకి వెళ్ళినంత సేపూ నువ్వు డ్రాయింగ్ రూంలోనే వున్నావా?" అడిగాను.

తలూపాడు. "నువ్వు తిరిగి వచ్చేవరకూ లోపలే కూర్చున్నాను."

"అదే అదునుగా భావించి విశాలి బొమ్మ మ్యూజియం గదిలోంచి బైటికివచ్చి, నిశ్శబ్దంగా మేడమీదికి చేరి, నిద్రలో వున్న వెంకట్రావుని పొడిచేసుండాలి. గావుకేక వినిపించగానే మనం క్షణంకూడా వృథా చెయ్యకుండా పైకి వచ్చాం! మధ్యలో ఆ బొమ్మ మనకు ఎదురుపడలేదు.

అంటే, అది ఇంకా మ్యూజియంలోకి వెళ్ళలేదన్నమాట. పద. దానికన్నా ముందు మనం అక్కడికెళ్ళి కాచుకుందాం! అది రాగానే రంగుచేతులతో పట్టుకోవచ్చు!" అన్నాను ఉద్వేగంతో.

నాకు పిచ్చిపట్టిందేమో అన్నట్టు అనుమానంగా చూశాడు ప్రదీప్.

"అనవసరంగా ఆలస్యం చెయ్యక పద" అంటూ బైటికి నడిచాను.

వెంకట్రావు శవం వున్న గదిలో ఇక వుండలేక, గబగబ నన్ను అనుసరించాడు ప్రదీప్. ఇంట్లో సూదిపడితే వినిపించే నిశ్శబ్దం ఆవహించి వుంది. బొమ్మ ఉనికి కూడా లేదు ఎక్కడా! క్షణాల్లో మెట్లు దిగి మ్యూజియం గదిని సమీపించాం!

తలుపు ఎప్పటిలాగే వేసివుంది. తోశాను. తెరుచుకుంది. లోన అడుగుపెట్టి నిర్ఘాంతపోయాం! షో కేస్

ఖాళీ!! ప్రతిమ లేదు!!!

అది చూడగానే భయంతో ప్రదీప్ కళ్ళు విప్పారాయి.

తలుపుల్ని తిరిగి యథాప్రకారం దగ్గరగా మూశాను.

"చూశావా? నా అనుమానం వట్టి అనుమానం కాదని ఇప్పుడైనా నమ్మకం కుదిరిందా నీకు?"

"లేదు! మనల్ని తప్పుదారి పట్టించడానికి ఎవ్వరో దాన్ని బైటికి తీసికెళ్ళుంటారు" అన్నాడు ప్రదీప్ కంఠంలో ఆత్మ విశ్వాసాన్ని అరువు తెచ్చుకుంటూ.

"ఇంట్లో వున్నది మనమిద్దరమే! డాక్టర్ నా కళ్ళ ముందే కార్లో వెళ్ళిపోయాడు."

"మనకు తెలీకుండా ఇంట్లో ఎవ్వరో ఉన్నారేమో!"

అతని మాటల్ని పట్టించుకోకుండా గదిలో వున్న లైటార్పడానికి స్విచ్ మీద చెయ్యి వేశాను.

"లైటెందుకు ఆర్పుతున్నావ్?" అడిగాడు ప్రదీప్ భయంగా.

"ష్....మాట్లాడక! అదుగో, బైటినించి యెవ్వరో ఇటే వస్తున్న అడుగుల చప్పుడు వినిపిస్తోంది!" అంటూ చటుక్కున స్విచ్ ఆఫ్ చేశాను.

గదిలో అంధకారం! గాఢాంధకారం!!

ప్రదీప్ ఏదో అనడానికి నోరు తెరిచి, వెంటనే మూసుకున్నాడు. ఆ అడుగుల చప్పుడు తలుపును సమీపించింది అప్పటికే! ఆ నిశ్శబ్ద వాతావరణంలో మెమ్మదిగా తెరుచుకుంటున్న తలుపు శబ్దం ఒళ్ళు జలదరింప జేసింది.

బాగా బెదిరిపోయినట్టు వేగంగా పీల్చి వదులుతున్న ప్రదీప్ ఉచ్ఛ్వాస నిశ్వాసలు స్పష్టంగా వినిపిస్తున్నాయి

నాకు. తలుపు పూర్తిగా తెరుచుకుంది. యెవ్వరో లోన అడుగుపెట్టారు. యథాప్రకారం మళ్ళీ మూసుకుంది తలుపు.

మా పక్కనించి ఓ ఆకారం నడిచి వెళుతున్నట్టు బట్టల సరసర చప్పుడు చాలా స్పష్టంగా వినిపిస్తోంది. అడ నేలను తాకుతూ రాసుకుంటున్న గౌను చప్పుడు. నా చెయ్యి అప్రయత్నంగా లైటు స్విచ్ మీదికి వెళ్ళింది.

మళ్ళీ అప్రయత్నంగా నే దాన్ని ఆన్ చెయ్యకూడదని నిర్ణయించుకున్నాను. ఆ ఆకారం షో కేస్ వైపు వెళుతున్నట్టు సరసర చప్పుడు వినిపిస్తోంది చీకట్లో. భయం వల్ల కాబోలు ప్రదీప్ కంఠంలోంచి చిత్రమైన శబ్దం వెలికివచ్చింది. అంతే!

చటుక్కున ఆగిపోయింది ఆ ఆకారం! ఊపిరి బిగబట్టి చూడసాగాను. రెండు క్షణాల తరవాత ఆ ఆకారం మళ్ళీ షో కేస్ వైపు వెళుతున్న చప్పుడు. ఆ వెంటనే మెల్లగా దాని అద్దాల తలుపు తెరుచుకుంటున్న సవ్వడి.

ప్రదీప్ లో ఇక సహన శక్తి నశించినట్టుంది. “అరుణ్! లైటు వెయ్యి!” అన్నాడు వణుకుతూ.

నేను పలకలేదు. లైటు వెయ్యలేదు.

షో కేస్ తలుపు చప్పుడు మళ్ళీ వినిపించింది. అంటే మూసుకుందన్న మాట!

ప్రదీప్ ఇక ఆగలేకపోయాడు. ‘ఛక్’మంటూ అతని చేతిలో లైటర్ వెలిగింది. ఆ లైటర్ పట్టుకున్న అతని చెయ్యి ఎండుటాకులా వణుకుతోంది.

షో కేస్ వైపు చూశాను. దిగ్భ్రాంతితో నా కళ్ళు విప్పారాయి!

విశాలి ప్రతిమ వచ్చేసింది!!

"అర్జున్! ప్రతిమ ఎలా వచ్చింది లోపలికి? నువ్వు తెచ్చావా?" భయంవల్లా, షాక్ వల్లా విచక్షణా జ్ఞానం నశించినట్టుంది ప్రదీప్ లో.

"నేనెలా తెస్తాను? లైటినించి అడుగుల శబ్దం వినిపిస్తున్నప్పుడు మనిద్దరం గదిలోనే వున్నాం కదా?" అన్నాను.

తలతిప్పి షో కేస్ వైపు చూశాడు ప్రదీప్. భయంతో గావుకేక పెట్టాడు. ఆ అరుపుకు అతని చేతిలో వున్న లైటర్ క్రిందపడి ఆరిపోయింది.

మళ్ళీ చీకటి! చిమ్మ చీకటి!!

"ప్రదీప్! ఏమైంది? ఎందుకలా అరిచావ్?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఆ బొమ్మ....ఆ బొమ్మ నన్ను ఉరిమిచూసింది. దాని కనుబొమలు కూడా కదిలాయి."

"నీకు ప్రియమైన విశాలి బొమ్మేకదా? ఎందుకంతగా భయపడాలి? ఇక్కడే వుండు. నేను హాల్లోకెళ్ళి డాక్టర్ కూ, పోలీసులకూ ఫోన్ జేసి వస్తాను."

"వద్దు. నువ్వే ఉండిక్కడ. నే వెళ్ళి ఫోన్ జేస్తాను" అంటూ తలుపువైపు నడవబోయాడు ప్రదీప్.

అతని చెయ్యి పట్టుకున్నాను. "ఇంతసేపూ ప్రతిమకు ప్రాణం రావడమేమిటని నాతో వాదించావు కదా? ఇప్పుడు నువ్వెందుకిలా భయపడుతున్నావ్?"

"ఎందుకో....ఎందుకో .... నాకే తెలీదు .... నువ్వు చెప్పింది నిజమే నేమో?"

"అటువంటప్పుడు నువ్వింకా ఆనందించాలి కదా? మనసారా ప్రేమించిన ప్రేయసి ఆత్మ ఆమె ప్రతి రూపంలో జీవం పోసుకున్నందుకు పరవశించడంపోయి,

ఎందుకిలా భయపడుతున్నావు?"

ప్రదీప్ పలకలేదు. గజగజ వణుకుతున్నాడు.

8

"చేజేతులా నన్ను చంపినవాడు నా ఆత్మను చూసి ఎందుకు ఆనందిస్తాడు?" గదిలో మారుమ్రోగింది స్త్రీ కంఠం.

వెంటనే పోల్చుకున్నాను ఆ కంఠాన్ని! అది విశాలి కంఠం!

"నిన్ను చంపింది ప్రదీపా?" నోరు తెరిచాను దిగ్భ్రాంతితో.

"ఔను. అతనే! అంతేకాదు, నా తండ్రినీ, పిన్ని భానుమతినీ, చిన్నాన్ననూ చంపింది కూడా అతనే!"

"ఏమిటి నువ్వంటోంది? ఇంతమందిని చంపితే ఇతనికి ఒరిగేదేమిటి?" అడిగాను నివ్వెరబోతూ.

"ఆస్తి! నాకు చెందిన యావదాస్తి!!"

"నీకు చెందిన ఆస్తి ఇతనికెలా సంక్రమిస్తుంది? ఇతనికీ, నీకూ ఏమిటి సంబంధం?"

"భార్యాభర్తల సంబంధం!"

"వా....ట్!?"

"ఔను, మూడు నెలలక్రితం మేము రహస్యంగా రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళిచేసుకున్నాం!"

చీకట్లో ప్రదీప్ చెయ్యి పట్టుకున్నాను గట్టిగా. "ప్రదీప్! చెప్పు. నిజం చెప్పు. ఇదంతా నిజమేనా?"

అతను పలకలేదు. వణుకుతున్నాడు.

"నువ్వు కాదన్నా రిజిస్ట్రార్ ఆఫీసులో కనుక్కుంటే తెలిసిపోతుంది. చెప్పు, విశాలీ, నువ్వూ పెళ్ళిచేసుకున్నారా?" రెట్టించాను.

"ప్లీజ్! బైటికి పద. ఈ విషయాలు బైట కూడా మాట్లాడుకోవచ్చు. ఈ గదిలో ఇక ఒక్క క్షణంకూడా నేనుండలేను" అన్నాడు నన్ను తలుపువైపు లాగుతూ.

ఒడిసి పట్టుకున్నానతన్ని. "వీల్లేదు. ఇక్కడే చెప్పాలి. ఊఁ, త్వరగా చెప్పు!" అరిచాను.

అంతలో షో కేస్ తలుపు తెరుచుకుంటున్న శబ్దం వినిపించింది. ప్రదీప్ గింజుకోసాగాడు. రక్కుతున్నాడు నా చేతుల్ని. అంతమాత్రాన నా ఉక్కు పిడికిళ్ళు అతన్ని వదిలి పెడతాయా?

"అనవసరంగా ఆయాసపడక! నిజం చెప్పు. విశాలిని పెళ్ళి చేసుకున్నావా?"

"ఔను. చేసుకున్నాను" గత్యంతరంలేనట్టు నీరసంగా పలికాడు.

"విశాలినీ, ఆమె తండ్రినీ, భానుమతినీ, నువ్వే చంపావా?"

మౌనం! ఇప్పుడు షో కేస్ తలుపు పూర్తిగా తెరుచుకుంది.

"అదుగో, విశాలి ఆత్మ బొమ్మరూపంలో వచ్చేస్తోంది. నిన్ను చంపి, తన ప్రతీకారం తీర్చుకుంటుంది. నువ్వు ఆమెను కాదు, ఆమె ఐశ్వర్యాన్ని ప్రేమించావనీ, ఆ ఐశ్వర్యాన్ని కైంకర్యం చేసుకోడానికే ఆమెతో రహస్య పెళ్ళి నాటకమాడావనీ ఇప్పుడర్థమౌతోంది.

ముందామె తండ్రిని తుదముట్టించి, తరవాత ఆమెను చంపేశావు. నీమీద ఎవ్వరికీ అనుమానం రాకుండా, ఆమె శవాన్ని పోస్టుమార్టం జరిపించాలనీ, వెంకట్రావు దంపతుల మీద అనుమానం మళ్ళించాలనీ అద్భుతమైన

నాటకమాడావు.

ఒకవేళ పోస్టుమార్టం జరిగినా, ఆమె విష ప్రభావంలో మరణించినట్లు తేలినా, హత్యా నేరం ఆ భార్యాభర్తలిద్దరిమీదా మోపబడుతుందనీ, ఆ విధంగా వారి అడ్డు తొలిగాక నింపాదిగా నువ్వు విశాలి భర్తవని నిరూపించుకుని, ఆస్తిని అరగించవచ్చనీ ఎత్తు వేశావు.

పోస్టుమార్టం ఎత్తు పారకపోడంతో, వెంకట్రావు మాటిమాటికీ విశాలి ఆత్మ ఆమె బొమ్మను ఆవహించిందనే భయాన్ని ఆధారం చేసుకుని, ఆ భార్యాభర్తల అడ్డు తొలగించుకోవాలని భావించావు.

ఈ రాత్రి భానుమతిని ఇంటి వెనక అగాధంలోకి తోసి చంపేశావు. దానికి తోడు నేనూ, వెంకట్రావూ భానుమతిని వెంబడించిన విశాలి ప్రతిమను చూడటం కూడా కలిసి వచ్చింది. ఐతే, భానుమతి వంటి మనిషిని ఇంటి వెనక్కి ఎలా రప్పించావో ఇప్పటికీ నాకర్థం కావడంలేదు.

ఆ తరవాత, వెంకట్రావును మేడపైన పడుకో బెట్టి డాక్టర్ కిందికి రావడం, నన్ను బైటికి తీసికెళ్ళడంతో ఆ అవకాశాన్ని జారవిడవకుండా పిల్లిలా మేడమీదికెళ్ళి అతని గుండెలో బాకుదింపి, శరవేగంతో తిరిగి డ్రాయింగ్ రూంలోకి వచ్చి కూర్చున్నావు.

అదే సమయంలో నేనక్కడికి రావడం, పైన వెంకట్రావు చావుకేక వినిపించడం జరిగింది! మత్తుమందు ప్రభావంలో పడున్న వెంకట్రావుకు తన గుండెలో దిగిన బాకు సంగతి వెంటనే తెలియలేదు.

చివరిక్షణంలో అతని మత్తు వదిలి, మస్తిష్కం జాగృతమై, మరణ భయాన్ని సూచించింది. అందుకే

అంత ఆలస్యంగా అతని కేక వినిపించింది. మనం వెళ్ళి చూసేలోపలే అతని ప్రాణం పరలోకానికి ప్రయాణమైంది.

అతను కూడా పాప భీతితో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పావు. ఐతే, మత్తుమందు ప్రభావంలో వున్న వ్యక్తి ఆత్మ హత్య ఎలా చేసుకుంటాడు? అంతేకాదు, డాక్టర్ పట్ల నువ్వు నాలో ఏర్పరచిన అనుమానం కూడా అప్పుడే తొలగిపోయింది.

ఈ వ్యవహారంలో డాక్టర్‌కు సంబంధం వుంటే, వెంకట్రావుకు మత్తుమందిచ్చి పడుకోబెట్టానని ఆయన నాతో చెప్పేవాడేకాదు. ఆ విధంగా వెంకట్రావు మరణాన్ని ఆయన ఆత్మహత్యగా యెలా చిత్రించగలడు....?"

నా మాట ఇంకా పూర్తి కాలేదు. షో కేస్ దగ్గర నుంచి విశాలి ప్రతిమ మమ్మల్ని సమీపిస్తున్నట్టు గాను కరకర శబ్దం వినిపించసాగింది.

"అర్జున్! ప్లీజ్, నన్ను కాపాడు. వెంటనే నన్ను బైటికి తీసికెళ్ళు" భయంతో ప్రదీప్ ఒళ్ళు జలదరిస్తోంది.

"చేసిన నేరాన్ని ఒప్పుకుంటేనే, నీ ప్రాణాలు కాపాడేది. చెప్పు. విశాలినీ, ఆమె తండ్రినీ, వెంకట్రావునూ, భానుమతినీ ఎవరు చంపారు?"

"నేనే! నేనే చంపాను!!"

అంతే! బైటినించి ఎవ్వరో ఛళ్ళున తోశారు తలుపుల్ని. మరుక్షణం నలుగురైదుగురు లోనికి వచ్చినట్టు బూట్ల శబ్దం వినిపించింది. నేను ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే 'ఛక్' మని వెలిగింది లైటు. స్విచ్ మీంచి

చెయ్యి తీసున్న డాక్టర్ సంజీవరావునీ, పోలీసుల్నీ చూసి చకితుణ్ణయిపోయాను.

ఆ షాక్‌ను తట్టుకోలేక ప్రదీప్ అమాంతం కుప్పకూలి మూర్ఛపోయాడు. వారిసంగతలా ఉంచి, నాకు చేరువలోనే నిల్చున్న విశాలిని చూసి నోరు తెరిచాను. ఆమె బొమ్మ విశాలి కాదు!!

పంచప్రాణాలున్న పరిపూర్ణ విశాలి!!!

"విశాలీ! నువ్వు బ్రతికే వున్నావా?" అడిగాను దిగ్భ్రాంతితో.

ఆమె నవ్వింది. "అవును. బ్రతికే ఉన్నాను."

"మరి నేను చూసిన శవమూ, శ్మశానంలో నీ అంత్యక్రియలూ?"

"అది నేను కాదు. మూసపోసినట్టు నన్ను పోలిన నా నిర్జీవ ప్రతిమ. అసలు నేరస్థుల్ని పట్టుకోవడానికి నేను మరణించానని ప్రకటించి, నా ప్రతిమకు అంత్యక్రియలు జరిపించి, డాక్టర్‌గారే ఈ నాటకమంతా ఆడించారు."

"ప్రదీప్‌ను రహస్యంగా పెళ్ళిజేసుకునే అగత్యం ఎందుకొచ్చింది నీకు?"

"మొదటినించీ నాన్నకు ఇతనిమీద సదభిప్రాయం లేదు. చదువుకునే రోజుల్లోనే నాకు నచ్చచెప్పేవారు ఇతనితో స్నేహాన్ని పెంచుకోవద్దని. ఐనా నే నాయన మాటలు పట్టించుకోలేదు. ప్రేమ గుడ్డిదంటారు అందుకేనేమో!

చదువు పూర్తయ్యాక ఒకరోజు నాన్నతో మా పెళ్ళి ప్రస్తావన ఎత్తాను. ససేమిరా వీల్లేదన్నారు. తన మిత్రుడి కొడుక్కి నన్నివ్వదలచినట్టు కూడా చెప్పారు. దాంతో నాలో పంతం పెరిగింది.

దానికి తోడు ఇతనుకూడా నన్ను రహస్యంగా పెళ్ళి చేసుకుందామనీ, ఆ పెళ్ళిని కొంతకాలం గోప్యంగా ఉంచి, ఆతరవాత నిదానంగా నాన్నకు తెల్పితే ఆయనే దారికి వస్తాడనీ నూరిపోశాడు.

పూర్తిగా ఇతని మాయలోపడ్డ నేను వెంటనే అందుకు ఒప్పుకున్నాను. స్నేహితులతో విహారయాత్ర సాకు చెప్పి హానీమూన్ కూడా వెళ్ళొచ్చాం. ఆ తరవాత నెల రోజుల క్రితం హఠాత్తుగా నాన్న చనిపోయారు.

ఆయన మరణాన్ని ప్రమాద వశాత్తూ జరిగిన దుర్ఘటనగానే భావించాను. నాన్న మరణంతో ఇతను మా ఇంటికి రావడానికి ఏ ఆటంకమూ లేకపోయింది. ఇప్పుడయినా మా పెళ్ళి విషయాన్ని లోకానికి తెల్పడం మంచిదని చెప్పాను.

కొన్నాళ్ళు పోయాక అందర్నీ పిల్చి శాస్త్రోక్తంగా మళ్ళీ పెళ్ళి చేసుకుందామని చెప్పాడు. అదీ మంచిదే అని ఊరుకున్నాను. నాన్న మరణంతో మనసు బాగులేక నేను బాగా నీరసించిపోయానని డాక్టర్ గారు ఓ టానిక్ రాసిచ్చారు.

అది తాగిన రెండు రోజులు ఏమీ జరగలేదు. మూడో రోజు త్రాగి పడుకోగానే విపరీతమైన వాంతులూ, విరేచనాలూ ప్రారంభమయ్యాయి. వెంటనే డాక్టర్ గారికి ఫోన్ చేసి పిలిపించాడు చిన్నాన్న. ఎంతో ప్రయత్నం మీద ఆయన నన్ను కాపాడగలిగారు.

ఆ టానిక్ మీద ఎందుకో ఆయన కనుమానం వేసింది. వెంటనే దాన్ని లాబొరేటరీలో పరీక్ష చేయించారు. అప్పుడు తెలిసింది అసలు రహస్యం టానిక్‌లో విషం కలిపి వుందని.

అది చిన్నాన్నా, చిన్నమ్మల పనే అయుంటుందని డాక్టర్ గారికీ, నాకూ పూర్తిగా అనుమానం బలపడింది. కారణం నాతో బాటు ఇంట్లో వుండేది వాళ్ళిద్దరే గనక. అంతేకాదు, నాన్న మరణానిక్కూడా వాళ్ళే కారణమై వుంటారేమోనన్న సందేహం కూడా కలక్కపోలేదు.

ఐతే నిజాన్ని యెలా నిరూపించడం? వారి నోట నేరాన్ని యెలా వొప్పించడం? ఆలోచించి ఓ పథకం తయారుచేశారు డాక్టరుగారు. నిన్న ఉదయం యెంతకీ నా గది తలుపు తెరుచుకోకపోడంతో చిన్నాన్న తలుపు తోసి లోపలికొచ్చాడు.

ఆయన రాకకోసమే యెదురుచూస్తున్న నేను ఊపిరి బిగబట్టి అచేతనంగా మంచంమీద పడుకున్నాను. ఎంత పిల్చినా పలకలేదు. దాంతో ఆయన ఖంగారుపడి డాక్టర్ గారికి ఫోన్ జేశారు.

ఆయన వచ్చి నన్ను పరీక్షించి మరణించినట్టు ప్రకటించారు. తరవాత నన్ను డ్రాయింగ్ రూంలో పడుకోబెట్టారు. డాక్టర్ గారు ఇంట్లో వాళ్ళని అటూ యిటూ పంపి, ఇక్కడున్న నా ప్రతిమను మోసుకెళ్ళి డ్రాయింగ్ రూంలో నా స్థానంలో పడుకోబెట్టి, మెడ వరకూ దుప్పటి కప్పి అక్కణ్ణించి తప్పుకున్నారు.

చిన్నాన్న మేడ మెట్లు దిగి డ్రాయింగ్ రూం వైపు వస్తుండగా ఆయనకు కనిపించేలా ఈ గదిలోకి వచ్చి తలుపు మూసుకుని షో కేస్‌లో బొమ్మలా నిల్చున్నాను. దాంతో అది వరకు ఆయన ముందు నేను వ్యక్తం జేసిన భయం నిజమేననీ, చనిపోయిన నా ఆత్మ మ్యూజియం గదిలోని బొమ్మలో విలీనమైందనీ భ్రమించాడు.

ఆ తరవాత స్మశానంలో బొమ్మను చితి మధ్య వుంచి

నప్పంటించి వర్షం వస్తుందన్న నెపంతో అందర్నీ అక్క-డ్నించి యింటికి తరలించారు డాక్టర్ గారు. తరవాత అందరూ వెళ్ళిపోయాక చిన్నాన్న, మీరూ, పిన్నీ మేడ మీది కెళ్ళారు.

నేను షో కేస్ లోంచి బయటికి వచ్చి ఈ గదిలో షే పచార్లు చేస్తూ నా తరవాతి కార్యక్రమం గురించి ఆలో-చించసాగాను. రాత్రి పది గంటలు దాటాక యెవరో మేడ మెట్లు దిగి కిందికి వస్తున్నట్టు అడుగుల చప్పుడు వినిపించింది.

తలుపు సందులోంచి హాల్లోకి చూశాను. పిన్ని మెట్లు దిగి హాల్లోంచి బయటికెళ్ళే తలుపు వైపు వెళుతోంది. అంత రాత్రి ఒంటరిగా ఆమె యెక్కడికి వెళుతోందా అని ఆశ్చర్యం వేసింది నాకు.

ఆమె బయటికెళ్ళాక నేనూ ఈ గదిలోంచి బయట పడి హాలు తలుపు కొద్దిగా తెరిచి తొంగి చూశాను. మసక వెలుతుర్లో పిన్ని మేడ వెనక్కి వెళుతూ కనిపిం-చింది. ఆమెను కాస్త ముందుకు పోనిచ్చి పిల్లిలా వెంబ-డించాను.

పిన్ని మేడ వెనక సీతాఫల చెట్ల గుబురు దగ్గరికి వెళ్ళడం చూసి నివ్వెరబోయాను. ఆమె కంటికి కనబడ-కుండా నేనూ ఓ పెద్ద మాటున నక్కి చూడసాగాను. చెట్ల కవతల నిల్చుని ఆమె ఎవరితోనో మాట్లాడుతోంది.

ఆమెతో మాట్లాడుతున్నది మగకంఠమనీ, అది నాకు సుపరిచితమేనని వెంటనే పసిగట్టాను. అంతే! కొద్ది క్షణాల్లోనే పిన్ని గావుకేక వినిపించింది. మరుక్షణం పొదల వెనకనించి మెరుపులా ఓ మగ ఆకారం ఇవతలికి వచ్చి గబగబ ఇంటి ముందు భాగం వైపు వెళ్ళసాగింది.

వెన్నెల మసక వెలుగులో ఆ ఆకారాన్ని పోల్చుకుని నిర్ఘాంతపోయాను. అతను ఎవ్వరో కాదు, సాక్షాత్ ప్రదీపే. పిన్ని అతన్ని అక్కడ ఎందుకు కలుసుకుంది? ఆమెకూ, అతనికీ ఏమిటి సంబంధం? ఇంతవరకూ నాకు అంతుపట్టని విషయాలివి!

ప్రదీప్ ఆ పొదల దగ్గర్నించి పిన్నిని అగాధంలోకి తోసేశాడనీ, సరిగ్గా ఆ ప్రదేశంలోనే నాన్న పడిపోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడనీ, ఇంతవరకూ నే ననుమానిస్తున్నట్టు చిన్నాన్నా, పిన్నీ దోషులు కారనీ, ఆస్తి కోసం ప్రదీపే ఈ నాటక మాడుతున్నాడనీ తెలిసిపోయింది నాకు.

అంతలో మేడమీద మీరున్న గది తలుపులు భళ్ళున తెరుచుకోవడం విన్నాను. అంటే పిన్ని గావుకేక మీరూ విని వుంటారనీ, మేడ వెనక్కి రావచ్చనీ భావించి గబగబ ఇంటివైపు నడిచాను. అప్పుడే మీరు మరో పక్కనించి మేడ వెనక్కి రావడం, నన్ను పిలవడం జరిగింది.

నేను మౌనంగా ఇంట్లోకి వచ్చి తిరిగి ఈ గదిలో మారి షో కేస్‌లో నిల్చున్నాను. ఆ తరవాత పోలీసులూ, డాక్టర్ గారూ, ప్రదీప్ రావడం, నన్ను చూడటం, ప్రతిమగా భావించి వెళ్ళిపోవడం జరిగింది.

డాక్టరుగారు చిన్నాన్నను మేడమీద వదిలి, కిందికి వచ్చి మీతో మాట్లాడాలని బయటికి తీసికెళ్ళారు. నేను తలుపు సందులోంచి అంతా చూస్తూనే ఉన్నాను.

మీరలా వెళ్ళగానే ప్రదీప్ గబగబ మెట్లెక్కి మేడ మీదికి వెళ్ళడం కనిపించింది. యేదో అనుమానం వేసి అతని వెనకే పిల్లిలా పైకి చేరాను. అప్పటికే అతను చిన్నాన్న గుండెలో కత్తి దింపి, బయటికి వస్తూండటం

కూడా జరిగిపోయింది. అతనికి కనబడకుండా మెరుపులా మీకు కేటాయించిన గదిలో దూరి తలుపు చాటున నక్కాను.

అతను కిందికెళ్ళడం, ఆ వెంటనే చిన్నాన్న గావు కేక వినిపించడం, మీ ఇద్దరూ పైకి రావడం, తరవాత నన్ను పట్టుకోవాలని మ్యూజియం గదిలో దూరి తలుపు మూసుకోవడం జరిగింది.

నేను మెల్లిగా మెట్లు దిగి హాల్లోని టెలిఫోన్ ద్వారా పోలీసులకూ, డాక్టర్ గారికీ ఫోన్లు చేసి, కొంతసేప య్యాక మూసి వున్న మ్యూజియం గది తలుపు తోసి చీకట్లో లోనికి వచ్చాను.

ఆ లోపల డాక్టర్ గారే పోలీసుల్ని వెంటబెట్టుకొని వచ్చి తలుపు కవతల నిల్చున్నారు. ప్రదీప్ తన నేరాన్ని అంగీకరించగానే లోపలికి వచ్చేశారు" అంటూ ముగిం చింది విశాలి.

ప్రదీప్ వైపు చూశాను. ఇంకా స్పృహ రాలేదతనికి.

పోలీసులు నేలమీంచి అతన్ని లేపి బయటికి తీసికెళ్ళ సాగారు.

అటువంటి నీచుడ్ని ప్రేమించినందుకు, వినవాళ్ళను పోగొట్టుకున్నందుకు చేతుల్లో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది విశాలి.

నేనూ, డాక్టర్ చేష్టలుడిగి చూస్తూ నిల్చుండిపోయాం శిలా ప్రతిమల్లా.

—: అయిపోయింది: —